


## గ్రీన్ కార్డ్

**మయూరి వారపత్రికలో** 2000 దీపావళి సంచికలో గ్రీన్ కార్డ్ సీరియల్ ఆరంభమైంది. అమెరికాకి వలస వెళ్ళే విషయంలో నేను సేకరించిన సమాచారం గురించి అంకుల్ సామ్, గగనసీమ నవలా పరిచయాల్లో రాసాను. దాంట్లో పొలిటికల్ అసైలమ్ (రాజకీయ పునరావాసం) కూడా ఉంది. పొలిటికల్ అసైలమ్‌లో కూడా నాటకీయతని చొప్పించవచ్చు అనిపించాక అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకి వలస వెళ్ళిన నా పెద్ద మేనల్లుడు జె.ఎస్.ఆర్ ప్రసాద్‌కి ఉత్తరం రాసి ఆ సమాచారాన్ని తెప్పించుకున్నాను. దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆ నేపథ్యంలో ఓ కథని అల్లుకున్నాను.




ఏ దేశస్థులకైనా ఆ దేశ ప్రభుత్వం నుంచి కాని, ఉగ్రవాదుల నించి కాని ప్రాణభయం ఉంటే పరాయి దేశాలకి వలస వెళ్ళి రాజకీయ పునరావాసాన్ని కోరచ్చు. యూరప్‌లోని సంపన్నదేశాలు, అమెరికా, కెనడానేకాక ఇండియాలాంటి దేశాలు కూడా రాజకీయ పునరావాసాన్ని కల్పిస్తాయి. టిబెట్‌కి చెందిన దలైలామాకి, బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్‌లకి ఇండియా పునరావాసాన్ని కల్పించిన సంగతి పాఠకులకి తెలుసు. ఇండియన్ రచయిత సల్మాన్ రష్దీ మీద ముస్లింలు ఫత్వాని జారీ చేయడంతో యు.కెకి పొలిటికల్ అసైలంతో వెళ్ళాడు. తన ప్రాణాలకి ప్రమాదం ఉందని ఇండియన్ చిత్రకారుడు ఎం.ఎస్. హుస్సేన్ ఖతార్ దేశానికి స్వచ్ఛందంగా వెళ్ళి తన ఇండియన్ పాస్‌పోర్ట్‌ని సరెండర్ చేసి లండన్, దోహాల్లో జీవించాడు. ఐతే హుస్సేన్ రాజకీయ పునరావాసం కోరి వెళ్ళలేదు.

గోపీనాథ్ దొంగ వీసా యు.ఎస్.ఏ వెళ్ళి పట్టుబడ్డాడు. అతని దగ్గర విమానం టిక్కెట్‌కి డబ్బు లేకపోవడంతో ఇండియాకి కార్గో

షిప్‌లో తిప్పి పంపబడ్డాడు. తిరిగి వచ్చాక తన అనుభవాన్ని ఉపయోగించి తన తమ్ముడి విరించిని ఎలాగైనా అమెరికాకి రాజకీయ పునరావాసం కోసం పంపాలనుకున్నాడు. అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేసాడు.

అందుకు ఉగ్రవాద సంస్థ నక్సలైట్ పేరుని వాడటానికి భయపడి పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐ.ఎస్.ఐ పేరు వాడాడు. ఓ ఐ.ఎస్.ఐ ఏజెంట్ విరించి జెరాక్స్ షాప్‌కి జెరాక్స్ తీయించుకోడానికి వచ్చినప్పుడు కొన్ని కీలకపత్రాలు దొంగిలించాడనే అనుమానంతో విరించి మీద నాలుగు హత్యాప్రయత్నాలు చేసారని ప్రచారం చేసి ఉత్తుత్తి హత్యాప్రయత్నాలు చేయించాడు. ఇవన్నీ దినపత్రికల్లో వార్తలుగా వెలువడ్డాయి. దొంగ బిజినెస్ వీసా మీద తమ్ముడ్ని విజయవంతంగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకి పంపాక అతని చేత పొలిటికల్ అసైలమ్‌కి అప్లై చేయించాడు. అప్పట్లో ఓ ప్రఖ్యాత కన్సల్టెన్సీ ఇంటర్వ్యూ చేసినప్పుడు వారు ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో, వాటికి ఏం జవాబులు ఇవ్వాలో గోపీనాథ్ ముందే తర్ఫీదు ఇవ్వడంతో తనని ఓసారి కత్తితో పొడిచి చంపే ప్రయత్నం చేయడం, మరోసారి తుపాకీతో కాల్చడం, మూడోసారి పెట్రోల్ పోసి అంటించే ప్రయత్నం చేయడం చెప్పి, వివిధ దినపత్రికల్లో వచ్చిన ఆ వార్తల కటింగ్స్‌ని చూపిస్తాడు. ఆత్మరక్షణ కోసం తను రివాల్వర్ కోసం అప్లై చేస్తే దాన్ని పోలీసులు తిరస్కరించిన కాగితం, తనకి రక్షణ ఇవ్వకపోవడం మొదలైన ఋజువుల్ని కూడా చూపిస్తాడు. ఇవన్నీ గోపీనాథ్ పోలీసులకి లంచం ఇచ్చి సంపాదించినవే. అన్నీ పరిశీలించి, తృప్తిపడ్డాక విరించికి పొలిటికల్ అసైలమ్ మంజూరవుతుంది. టెంపరరీ వర్క్ పర్మిట్ మంజూరు అయ్యే సమయానికి చిన్న మలుపుతో విరించి మోసం బయటపడుతుంది. అతన్ని కూడా వెనక్కి పంపేస్తారు. ఈసారి గోపీనాథ్ అందుకు విచారపడడు. కారణం తన పథకంలోని లోపం వల్ల కాక విధి వక్రించి రహస్యం బయటపడటం.

అమెరికాకి ఏ దేశాల నించి పెద్దగా ప్రజలు వలస వెళ్ళరో ఆ దేశాల ప్రజలని అమెరికాకి రప్పించడానికి ఆ దేశాల్లో ఏటా గ్రీన్‌కార్డ్ లాటరీని అమెరికా ప్రభుత్వం నిర్వహిస్తోంది. లేటిన్ అమెరికా, ఆఫ్రికా, యూరప్‌లోని కొన్ని దేశాల వారు కొంత రుసుము చెల్లించి ఇందులో పాల్గొనవచ్చు. లాటరీ తగిలితే ఆ కుటుంబ సభ్యులందరికీ అమెరికన్ గ్రీన్ కార్డ్ తక్షణం లభిస్తుంది కాబట్టి వారంతా అమెరికాకి వెళ్ళొచ్చు. (ఇటీవల న్యూయార్క్‌లోని టేక్సీ డ్రైవర్ సైఫుల్లో హబీబుల్లవిక్ సైపోవ్ ఉగ్రవాదిగా మారి చాలామందిని చంపాడు. అతను యుక్రెయిన్ నించి లాటరీద్వారా వచ్చిన గ్రీన్‌కార్డ్ హోల్డర్. తర్వాత అమెరికా పౌరసత్వం తీసుకున్నాడు అని పాఠకులకి తెలుసు) ఇండియా నించి చాలామంది వలస వెళ్తుంటారు కాబట్టి గ్రీన్‌కార్డ్ లాటరీ సౌకర్యం ఇండియన్స్‌కి లేదు. రాక్షసులు, దేవతలు లేరని తెలిసినా చిన్న పిల్లలకి ఆ కల్పితపాత్రలతో కథ చెపితే పిల్లలు ఆసక్తిగా వింటారు. ఇలాగే కథా సౌలభ్యం కోసం ఈ ఒక్క విషయంలో పక్కకి వెళ్ళి ఇండియాలో కూడా గ్రీన్ కార్డ్ లాటరీ ఉన్నట్లుగా, విరించికి ఆ లాటరీ తగిలి అమెరికాకి వెళ్ళినట్లుగా నవలని సుఖాంతంగా ముగించాను.

విరించికి మానసి అనే ప్రియురాలితో లవ్‌ట్రాక్, అమెరికా భర్తలు డబ్బు కోసం చేసే మోసాలు, తద్వారా ఆడవాళ్ళ కష్టాలు, అమెరికాలో వాళ్ళని ఆదుకునే బేటర్డ్ హోమ్స్ గురించి కూడా రాసాను. బిల్ క్లింటన్ యాంటీ - క్రైమ్ బిల్‌ని ప్రవేశపెట్టాడు. దాంట్లో ఇమిగ్రేషన్ చట్టాల్లో మార్పు వచ్చి ఇలాంటి మహిళలని రక్షించే అవకాశాలు వచ్చాయి. అలాగే 1996లో వచ్చిన కొత్త ఇమిగ్రేషన్ చట్టం గురించి కూడా ఇందులో వివరించాను. అమెరికాలో నాన్ - ఇమిగ్రెంట్ వీసా మీద వరసగా ఆరు నెలలు ఉండి, పక్కనే ఉన్న కెనడా లేదా మెక్సికోకి వెళ్ళి మరో ఆర్నెల్లు తమ నాన్ - ఇమిగ్రెంట్ వీసాని రెన్యూ చేసుకుని లీగల్‌గా వారు అమెరికాలో కొనసాగే పద్ధతికి అది స్వస్తి పలికింది. అవకాశం ఉన్న చోటల్లా హాస్యాన్ని గుప్పించాను.

ఇది కన్నడంలో ఓ దినపత్రికలో సీరియల్‌గా వెలువడింది. ఏప్రిల్ 2001లో లిపి పబ్లికేషన్స్ దీన్ని పుస్తకంగా వెలువరించింది. 168 పేజీలు. వెల రూ.40/ నవల చివర అనుబంధంగా అమెరికాకి వలస వెళ్ళాలనుకునే వాళ్ళకి వలస విధానం మీద సమాచారాన్ని కూడా ఇచ్చాను. మలిముద్రణని మళ్ళీ వేయలేదు.

***కొసమెరుపు:*** 1990లలో నేను కుటుంబ సభ్యులతో అమెరికాకి వలస వెళ్ళాలని అనుకునేవాడిని. బెనర్జీని అడిగాను, నేను మోటార్ సైకిల్ మీద వెళ్తూంటే కొందరు చూస్తూండగా నా మీద కిరసనాయిలు పోసి అంటించినట్లు నటిస్తారా అని. తను రెడీ అన్నారు. అప్పటికి బెనర్జీ అసిస్టెంట్ డైరెక్టర్ తప్ప నటుడు కాలేదు. రాజకీయ పునరావాసం తప్ప ఇంకే దారి నాకు లేదు. నాకు అప్పట్లో సరదాగా వచ్చిన ఆలోచనల్నే ఈ నవలగా రాసాను.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*